


రేణుకాఎల్లమ్మ గుడికి భూమిపూజ

అచ్చంపేట: ప్రభుత్వం కేటాయించిన స్థలంలో గౌడ కుల దేవత రేణుకా ఎల్లమ్మతల్లి, కంఠ మహేశ్వరస్వామి గుడి నిర్మాణానికి ఎమ్మెల్యే శంకరరావు గురువారం భూమిపూజ చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 522.40 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.



భక్తిశ్రద్ధలతో కోటిదీపోత్సవం

మచిలీపట్నంటౌన్: బందరు రాబర్ట్సన్‌పేట లోని రామలింగేశ్వరస్వామి గుడిలో గురువారం కోటి దీపోత్సవం జరిగింది. 35 అడుగుల శివుడి విగ్రహం వద్ద దీపాలను వెలిగించారు.

రైతుకు కొండంత భరోసా

- తుఫాన్ ప్రభావంతో పంటలకు తీవ్ర నష్టం
- రేపటి నుంచి పూర్తిస్థాయి నష్టనమోదు
- అర్హులందరికీ పరిహారం
- గత ప్రభుత్వం కన్నా అధికంగా ఆదుకునేందుకు కొత్త జీఓ
- నష్టపోయిన 90 రోజుల్లోనే పరిహారం అందిస్తున్న ఏకైక సర్కారు మాది
- సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వంపై ప్రతిపక్షాల ఆరోపణలు సరికాదు
- జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న శనగ పంటను చూపుతున్న మంత్రి అంబటి రాంబాబు చిత్రంలో ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, కలెక్టర్ శివశంకర్

సాక్షి, నరసరావుపేట: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు స్పష్టం చేశారు. నరసరావుపేట కలెక్టరేట్‌లో గురువారం ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, కలెక్టర్ శివశంకర్ లోతేటితో కలిసి మంత్రి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి మాట్లాడుతూ.. మిచాంగ్ తుఫాన్ వల్ల పల్నాడు జిల్లా రైతాంగం తీవ్రంగా నష్టపోయిందన్నారు. ముఖ్యంగా వరి, పత్తి, మిర్చి, అరటి, శనగ, కూరగాయల పంటలు నీట మునిగి బాగా దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతన్నలకు అండగా నిలుస్తోందన్నారు. ఆదుకునే క్రమంలో రైతుపక్షపాత వైఖరి అవలంబించి వీలైనంత అధిక లబ్ధి చేకూరుస్తామన్నారు. ఇప్పటికే ప్రాథమికంగా పంటనష్ట అంచనాలను అధికారులు రూపొందించారని, పూర్తి స్థాయిలో పంట నష్ట నమోదును ఈనెల 9 నుంచి చేపడతామని పేర్కొన్నారు. సచివాలయ వ్యవసాయ, ఉద్యానశాఖ సహాయకులు, వీఆర్వోల బృందం క్షేత్రస్థాయిలో నష్టపోయిన ప్రతి పొలం పరిశీలించి నష్టాన్ని నమోదు చేస్తుందన్నారు. 33 శాతానికన్నా అధికంగా నష్టం జరిగిన పంటకు పరిహారం అందుతుందన్నారు. శనగ విత్తనాలను 40 శాతం సబ్సిడీతో పంపిణీ చేశామని, దురదృష్టవశాత్తు తుఫాన్‌తో పంటలు పాడయ్యాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కి తెలిపి మరోసారి సబ్సిడీతో శనగ విత్తనాలు అందించేలా చూస్తామన్నారు.

జగన్ ప్రభుత్వంలోనే సత్వర న్యాయం

గత ప్రభుత్వ కాలంలో ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులు నష్టపోతే పరిహారం ఎప్పుడు అందుతుందో తెలిసేది కాదని, తిత్లీ తుఫాన్‌తో నష్టపోయిన రైతులకు ఆ ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వకపోవడంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అందజేశామని మంత్రి పేర్కొన్నారు. జగన్ ప్రభుత్వంలో ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు 90 రోజులలోపే పరిహారం అందజేస్తున్నట్టు ఉద్ఘాటించారు. రైతులను మరింత ఆదుకోవాలన్న ఉద్దేశంతో వైఎస్ జగన్ ఈ ఏడాది నవంబర్ 14వ తేదీన జీఓ ఎంఎస్ నంబర్ 5 విడుదల చేశారన్నారు. దీని ప్రకారం గతంలో హెక్టార్‌కు రూ.15 వేలు పరిహారం రాగా, ఇప్పుడు రూ.17 వేలు వస్తుందన్నారు. గతం కంటే హెక్టార్‌కు రూ.2వేలు అధిక పరిహారం అందిస్తున్నట్టు వెల్లడించారు. ఇన్ని చేస్తున్న జగన్ సర్కార్‌ను ప్రతిపక్షాలు విమర్శించడం భావ్యం కాదన్నారు. తుఫాన్ వచ్చిన వెంటనే సీఎం ఆదేశాల మేరకు ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు వెంటనే స్పందించి సహాయకార్యక్రమాలు చేపట్టారన్నారు. విద్యుత్ సరఫరాను త్వరగా పునరుద్ధరించామన్నారు. లోతట్టు ప్రాంతాలకు చెందిన 2,929 మందిని పునరావాస కేంద్రాలకు తరలించి అన్ని సౌకర్యాలూ కల్పించామన్నారు. అనంతరం కలెక్టర్ శివశంకర్ లోతేటి, ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడారు.

వేగంగా పంట నష్టం నమోదు

జగన్ సర్కార్‌లో ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు 90 రోజుల్లోపే పరిహారం అందుతోంది. గత ప్రభుత్వంలో రైతులకు ఇవ్వాల్సిన బకాయిలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక చెల్లించింది. గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామాల్లో సిబ్బంది కొరత లేకపోవడంతో పంట నష్టనమోదు వేగంగా ఖచ్చితత్వంతో సాగుతోంది. ఈ–క్రాప్ జరగని కొన్ని పంటలకూ నష్టపరిహారం అందిచేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు ప్రతి పక్షాలకు లేదు.

– డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, నరసరావుపేట ఎమ్మెల్యే

రైతులు ధైర్యంగా ఉండాలి

చిలకలూరిపేట, నాదెండ్ల, యడ్లపాడు, నరసరావుపేటలలో తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిశాయి. ఫలితంగా రైతులు తీవ్రంగా నష్టపోయారు. రైతులు ఏమాత్రం అధైర్యపడొద్దు. ప్రభుత్వం అండగా నిలుస్తుంది. పొలాలకు వచ్చే అధికారులు, సిబ్బందికి రైతులు సహకరించి పంట నష్టనమోదు సజావుగా జరిగేలా చూడాలి.

– శివశంకర్ లోతేటి, జిల్లా కలెక్టర్.

సంక్షేమ 'ఆటో'గ్రాఫ్

- ఉన్నతి–స్త్రీశక్తి పథకం ద్వారా ఆరుగురు మహిళలకు ఆటోలు పంపిణీ
- రూ.19 లక్షల మేర ప్రయోజనం
- ఆటోలు అందించిన కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట: మహిళాభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి చెప్పారు. గురువారం కలెక్టరేట్‌లో డీఆర్‌డీఏ–వైఎస్సార్ క్రాంతి పథం ఉన్నతి–మహిళా శక్తి పథకం ద్వారా ఆరుగురు ఎస్సీ, ఎస్టీ మహిళలకు రూ.19,24,515 విలువైన ఆటోలను కలెక్టర్ ఎల్.శివశంకర్, జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పంపిణీ చేశారు. ఆటోల రిబ్బన్ కటింగ్ చేసి లబ్ధిదారులకు తాళం చెవి, సంబంధిత పత్రాలను అందించారు. అనంతరం బొల్లాపల్లి మండలం రేమిడిచర్ల గ్రామానికి చెందిన లబ్ధిదారు తిరుపతమ్మ మాట్లాడుతూ ఉన్నతి–మహిళా శక్తి పథకం ద్వారా ఆటో కోసం దరఖాస్తు చేశానని, వడ్డీలేని రుణం ద్వారా ఆటో మంజూరు చేయడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ బి.బాలునాయక్, డీఆర్వో కె.వినాయకం హాజరయ్యారు. గిరిజన, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్లు పాలపర్తి వెంకటేశ్వర్లు, కందుల ఎజ్రా, డ్వాక్రా మహిళా నాయకురాలు సయ్యద్ ఫాతిమా, మైనార్టీ నాయకులు మహబూబుబాష, జిల్లా హెడ్ క్వార్టర్ ఏపీఎం భరత్, సివిల్స్ సప్లయిస్, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్లు సీసీలు ప్రసాద్, శివయ్య, నాగేశ్వరరావు, రాజు, సుజాత, ఆదిలక్ష్మి, శోభ, రామాంజమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఆటోలు పొందిన లబ్ధిదారులతో కలెక్టర్ శివశంకర్, జేసీ శ్యామ్‌ప్రసాదు, ఎమ్మెల్యే గోపిరెడ్డి

నకరికల్లు వద్ద మొసలి సంచారం

నకరికల్లు: జనసంచార ప్రదేశంలో మొసలి రావడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. నకరికల్లు నుంచి శివాపురంతండా వెళ్లే రహదారిలో రైల్వే వంతెన వద్ద మొసలి సంచరిస్తోంది. మొత్తం రాళ్లు, గుట్టలు ఉండే ప్రదేశం కావడంతో దగ్గరకు వెళ్లే వరకు పాదాచారులకు కన్పించడం లేదు. ఒక్కసారిగా మొసలిని చూసి ఉలిక్కిపడి భయభ్రాంతులకు గురవుతున్నారు. గతంలో పంట కాలువల్లో సంచరిస్తున్న మొసలిని అటవీశాఖ అధికారులు కుంకలగుంట వద్ద బోరు వేసి బంధించి జంతుసంరక్షణ కేంద్రానికి తరలించారు. మొసలి సంచరిస్తున్న ప్రాంతం అటవీప్రాంతానికి ఆనుకొని ఉండడంతో రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు కొట్టుకొని వచ్చి ఉంటుందని ప్రజలు భావిస్తున్నారు. ఫారెస్టు బీట్ ఆఫీసర్ పురుషోత్తంరాజును వివరణ కోరగా మొసలి ఉన్నట్లు తనకు తెలియరాలేదని, నిఘా పెడతామని తెలిపారు.



రైల్వేట్రాక్ వద్ద సంచరిస్తున్న మొసలి

న్యూస్‌రీల్

రెండు చోట్ల ఉన్న ఓట్లను తొలగించండి

వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్



గుంటూరు వెస్ట్ : ఇటీవల తెలంగాణ ఎన్నికల్లో ఓట్లు వేసిన కొందరికి మన జిల్లాలో, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో ఓట్లు ఉన్నాయని, వాటిని తొలగించాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్ జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డికి వినతి పత్రం అందజేశారు. గురువారం రాత్రి స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో డొక్కా మాట్లాడుతూ రెండు చోట్ల ఉండటం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. దీని వల్ల అక్రమాలు జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. సమావేశంలో అత్తోట జోసఫ్, అంగడి శ్రీనివాస్, షేక్ మస్తాన్‌వలి, మాదా రాధాకృష్ణమూర్తి, పాల్గొన్నారు.

10 నుంచి ఆల్ ఇండియా క్యారమ్స్ టోర్నమెంట్

గుంటూరు వెస్ట్ (క్రీడలు) : ఆల్ ఇండియా క్యారమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏపీ రాష్ట్ర క్యారమ్స్ సంఘం నిర్వహణలో ఈ నెల 10 నుంచి 13 వరకు విశాఖలో 28వ ఆల్ ఇండియా ఫెడరేషన్ కప్ క్యారమ్స్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని పోటీల నిర్వహణ కార్యదర్శి షేక్ అబ్దుల్ జలీల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 26 రాష్ట్రాల నుంచి జట్లు పాల్గొంటాయన్నారు. మొత్తం రూ.25 లక్షల వ్యయంతో భారీ స్థాయిలో ఏపీ రాష్ట్ర క్యారమ్స్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ నీరజ్ కుమార్ సంపతి నేతృత్వంలో నిర్వహిస్తామన్నారు. జిల్లా నుంచి పి.శ్రీనివాసరావు, షేక్ ఎండి సాదిఖ్, సిహెచ్ సుధలు ఎంపికయ్యారని పేర్కొన్నారు.

ప్రత్యేక అలంకారంలో నరేంద్రస్వామి



పెదపులివర్రు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం పెదపులివర్రు గ్రామంలో కొలువైన బాలా త్రిపుర సుందరి సమేత రాజరాజ నరేంద్రస్వామి దేవాలయంలో కార్తిక మాసం బహుళ దశి పురస్కరించుకుని గురువారం స్వామి వారికి 25వ రోజు ప్రాతఃకాలంలో ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అలాగే స్వామి వారికి ద్వాదశ హారతులు కొనసాగుతున్నాయి. పూజా కార్యక్రమాలను అర్చకులు ఆమంచి సృజన్ కుమార్ శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమాలను దేవస్థాన కమిటీ చైర్మన్ జంపని అంజయ్య, కార్యనిర్వాహణాధికారి మేకా సాంబశివరావు పర్యవేక్షిస్తున్నారు.

మూడు రోజుల వ్యవధిలో 3,966 మిల్లీమీటర్ల వర్షం

నరసరావుపేట: జిల్లాలో గడిచిన 24 గంటల వ్యవధిలో ఎక్కడా వర్షం పడలేదని వాతావరణశాఖ అధికారులు గురువారం వెల్లడించారు. మిచాంగ్ తుఫాన్ వల్ల నాలుగో తేదీ నుంచి ఆరో తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురిసిన విషయం తెలిసిందే. ఆ మూడురోజుల వ్యవధిలో జిల్లాలోని 28 మండలాల్లో 3,966.0 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. సగటున ప్రతి మండలంలో 141.6 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. 5న 1,252.4 మి.మీ. వర్షం పడగా 6న 2,713.6 మిల్లీమీటర్ల వర్షం పడింది. మూడురోజుల వ్యవధిలో చిలకలూరిపేటలో అత్యధికంగా 243.6 మి.మీ. వర్షం పడగా, సత్తెనపల్లిలో 232.0, నరసరావుపేటలో 219.8 మి.మీ. వర్షం కురిసింది. అత్యల్పంగా రెంటచింతలలో 51.4 మి.మీ. వర్షపాతం మాత్రమే నమోదైంది.

యార్డుకు 27,945 బస్తాల మిర్చి

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 27,945 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 26,950 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 24,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.10,000 నుంచి రూ.21,300 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.9,500 నుంచి 24,000 వరకు లభించింది.

యువర్ అటెన్షన్ ప్లీజ్

యువత.. ఓటే భవిత

- రేపటి వరకు కొత్త ఓటర్ల నమోదుకు అవకాశం
- మార్పులు, చేర్పులకు రేపే గడువు తేదీ
- 18 ఏళ్లు నిండిన వారందరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం
- జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు
- జనవరి 5న సంపూర్ణ ఓటర్ల జాబితా ప్రచురణ
- జిల్లాలో ముసాయిదా జాబితా ప్రకారం 17,01,399 మంది ఓటర్లు



సత్తెనపల్లిలో విద్యార్థులకు ఓటు హక్కు నమోదుపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, తహసీల్దార్ సురేష్, తదితరులు(ఫైల్)

సత్తెనపల్లి: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం వంటింది. అంతటి ప్రాధాన్యం ఉన్న ఓటు హక్కును 18 ఏళ్లు నిండిన ప్రతి పౌరుడికీ కల్పించాలని జిల్లా అధికార యంత్రాంగం నడుంకట్టింది. హక్కు కల్పించడమే కాకుండా దానిని అందరూ వినియోగించుకునేలా చైతన్యం తీసుకొస్తోంది. మరికొద్ది నెలల్లో సార్వత్రిక ఎన్నికలు రానున్న నేపథ్యంలో ఓటర్ల తుది జాబితా సిద్ధం చేసే పనిలో ఎన్నికల సంఘం నిమగ్నమైంది. ఇప్పటికే ముసాయిదా జాబితా విడుదల చేసింది. 18 ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కు నమోదు, మార్పులు, చేర్పుల కోసం ఈనెల 9వ తేదీ వరకు అవకాశం ఇచ్చింది. దీంతో యువత ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలని అధికారులు స్వీప్ ఓటరు పేరుతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రజల సౌకర్యార్థం ఓట్ల వివరాలను ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్, ఓటర్ హెల్ప్ లైన్ యాప్ ద్వారా తెలుసుకునే అవకాశాన్ని కల్పించారు.

జనవరి 5న తుది జాబితా

2023 అక్టోబర్ 27న విడుదల చేసిన ముసాయిదా జాబితా ప్రకారం జిల్లా వ్యాప్తంగా 17,01,399 మంది ఓటర్లు ఉండగా వీరిలో పురుషులు 8,33,923 మంది, మహిళలు 8,67,262 మంది, ట్రాన్స్‌జెండర్లు 214 మంది ఉన్నారు. సర్వీస్ ఓటర్లు 1,307 మంది ఉన్నారు. ముసాయిదా విడుదల నాటి నుంచి స్వీకరించిన ఓటు నమోదు, చేర్పులు, మార్పులు, తొలగింపు దరఖాస్తులను స్వీకరించారు. ఈనెల 9 వరకు స్వీకరించి జనవరి 5న సంపూర్ణ ఓటర్ల జాబితా విడుదల చేయనున్నారు.

ఓటు ఉందో లేదో చూసుకోండి

ఎన్నికల సంఘం ఓటర్స్ సర్వీస్ పోర్టల్ వెబ్‌సైట్ ద్వారా ఓటు ఉందో లేదో తెలుసుకునే అవకాశాన్ని కల్పించింది. ఇందుకు ఓటర్స్.ఈసీఐ.జీవోవీ.ఐఎన్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి సరి చూసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఒకవేళ ఓటు లేకపోతే ఫారం–6 ద్వారా నమోదు కావాల్సి ఉంది. ఓటర్‌కార్డులో చిరునామా మార్చుకోవాలనుకునేవారు ఫారం–8, పేరు తొలగింపునకు ఫారం–7 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఈ సేవలను పొందేందుకు బీఎల్‌ఓలను సంప్రదించాలి.

ముసాయిదా జాబితా ప్రకారం పల్నాడు జిల్లాలో ఓటర్లు ఇలా...

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
పెదకూరపాడు	1,10,062	1,14,485	23	2,24,570
చిలకలూరిపేట	1,07,925	1,17,009	49	2,24,983
నరసరావుపేట	1,11,931	1,16,688	38	2,28,657
సత్తెనపల్లి	1,14,976	1,19,449	17	2,34,442
వినుకొండ	1,28,638	1,29,331	21	2,57,990
గురజాల	1,30,782	1,37,185	43	2,68,010
మాచర్ల	1,29,609	1,33,115	23	2,62,747
మొత్తం	**8,33,923**	**8,67,262**	**214**	**17,01,399**

- ఓటర్ జాబితాలో పేరు ఉందో లేదో ఆండ్రాయిడ్ ఫోన్ ద్వారా చూసుకోవచ్చు. గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ డౌన్లోడ్ చేసుకుని భాష ఎంపిక చేసుకుని రిజిస్టర్ కావాలి.
- పాత ఓటర్ కార్డు ముందు భాగంలో బార్‌కోడ్ ఉంటుంది. ఓటర్ హెల్ప్ లైన్ యాప్‌లో బార్ కోడ్ స్కాన్ చేస్తే వివరాలు తెలుస్తాయి.
- కొత్తగా జారీ చేస్తున్న కార్డులు క్యూఆర్ కోడ్‌తో వస్తున్నాయి యాప్‌లో ఆ కోడ్ ఆప్షన్ ఎంపిక చేసుకొని స్కాన్ చేస్తే వివరాలు తెలుస్తాయి.
- తండ్రి పేరు, వయసు, జెండర్, జిల్లా, నియోజకవర్గ వివరాలు నమోదు చేసినా ఓటు హక్కు ఉందో లేదో తెలిసిపోతుంది.
- ఓటర్ కార్డు నంబర్ ఎంటర్ చేసినా వివరాలు తెలుస్తాయి.

టీడీపీ దొంగ ఓట్ల రాజకీయం

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలన్న తలంపుతో ప్రభుత్వం చర్యలు చేపడుతుంటే తెలుగుదేశం పార్టీ నేతలు దొంగ ఓట్ల రాజకీయం చేస్తున్నారు. హైదరాబాద్‌లో ఓటు వేసిన వారికి ఆంధ్రప్రదేశ్‌లో ఓటు హక్కు నమోదు చేసుకునేలా టీడీపీ నేతలు యత్నిస్తున్నారు. రాజకీయంగా లబ్ధి పొందేందుకు ఓవైపు దొంగఓట్ల ప్రయత్నాలు చేస్తూనే మరోవైపు వైఎస్సార్ సీపీపై నిరాధార ఆరోపణలు చేస్తూ ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు చేస్తున్నారు. టీడీపీ నేతల ఓట్లు తొలగిస్తున్నారని అడ్డగోలు ఆరోపణలు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులు తెలుసు కోకుండా ఆరోపణలు గుప్పిస్తున్నారు. ప్రభుత్వం పారదర్శకంగా ఓటర్ల జాబితా రూపకల్పనకు కృషి చేస్తోంది.

పారదర్శకంగా ఓటర్ల జాబితా



ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఓటర్ల జాబితా పూర్తి పారదర్శకంగా రూపొందించేందుకు కృషి చేస్తున్నాం. ఇప్పటికే ముసాయిదా జాబితాను విడుదల చేశాం. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలన్నదే ఎన్నికల సంఘం ఉద్దేశం. అందుకు అనుగుణంగా కొత్త ఓటర్ల నమోదుకు చర్యలు తీసుకుంటున్నాం. ఈ నెల 9వ తేదీలోగా అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలి. యువతకు ఓటు హక్కు ప్రాధాన్యాన్ని వివరించి వారిలో చైతన్యం తెచ్చేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం.

– బీఎల్ఎస్ రాజకుమారి, ఆర్డీవో, సత్తెనపల్లి



జిల్లాలో పింఛన్ల పంపిణీ 99.24 శాతం పూర్తి

నరసరావుపేట: జిల్లాలో సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ గురువారం సాయంత్రానికి 99.24 శాతం పూర్తి చేశారు. ప్రతి నెలా ఐదో తేదీతో ముగిసే పంపిణీని మిచాంగ్ తుఫాన్ కారణంగా ప్రభుత్వం రెండురోజుల పాటు పొడిగించింది. దీంతో వలంటీర్లు తుఫాన్ కారణంగా పంపిణీ చేయని వారికి కూడా అందజేశారు. దీంతో 2,80,368 మందికి పంపిణీ చేయాల్సివుండగా 2,78,235 మందికి పంపిణీ చేశారు.

క్లుప్తంగా

సిగరెట్ల అక్రమ రవాణాపై దాడులు



పాత గుంటూరు: గుంటూరు సీ జీఎస్టీ పరిధిలో రెండు లారీలలో అక్రమంగా రవాణా చేస్తున్న సిగరెట్‌లపై సీజీఎస్టీ నిఘా అధికారులు దాడులు చేసి సిగరెట్‌లను స్వాధీనం చేసుకున్నట్లు సీజీఎస్టీ సంయుక్త కమిషనర్ బి.లక్ష్మీనారాయణ తెలిపారు. కమిషనర్ సాధు నరసింహా రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన దాడుల్లో సంతమాగులూరు, నెల్లూరు సమీపంలో రెండు లారీల్లో తరలిస్తున్న 69,30,000 సిగరెట్లను స్వాధీన పరచుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. విలువ రూ. 3.4 కోట్లు ఉంటుందన్నారు. సిగరెట్లు స్మగ్లింగ్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

పూరిల్లు కూలి వృద్ధురాలు మృతి



ఐలవరం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం ఐలవరం తూర్పు దళితవాడకు చెందిన కర్రా అన్నపూర్ణమ్మ(65) గురువారం మృతి చెందింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మట్టి గోడలు నానిపోయి ఆ గుడిసెలో నిద్రిస్తున్న అన్నపూర్ణమ్మపై పడటంతో మృతి చెందింది. మృతురాలికి ఇరువురు కుమారులు ఉన్నారు. తహసీల్దార్ డి.వెంకటేశ్వరరావు ఆదేశానుసారం వీఆర్వో రత్నాకర్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ముంపు ప్రాంత పంటల పరిశీలన

రాష్ట్ర ఉద్యాన శాఖ కమిషనర్ డాక్టర్ శ్రీధర్

మార్టూరు: తుఫాన్ తీవ్రతకు మండలంలో దెబ్బతిన్న పంటలను రాష్ట్ర ఉద్యాన శాఖ కమిషనర్ డాక్టర్ ఎస్ఎస్ శ్రీధర్ గురువారం పరిశీలించారు. నాగరాజుపల్లి గ్రామంలో పడిపోయిన అరటి, మిరప పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడి పెట్టుబడి, ఇతర ఖర్చుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి అవసరమైన సాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి హనుమంతనాయక్, కిరణ్‌కుమార్, ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

శంకుస్థాపన అనంతరం ముఖ్యమంత్రితో మంత్రులు సత్యనారాయణ, తానేటి వనిత, ఎమ్మెల్యేలు, ఇతర ఉన్నతాధికారులు



'బృహత్తర' ఘట్టం.. అట్టహాసం



సీఎంకు అమ్మవారి చిత్రపటం బహూకరిస్తున్న మంత్రి సత్యనారాయణ, ఎమ్మెల్యే వెలంపల్లి, దుర్గగుడి ఈవో రామారావు, చైర్మన్ రాంబాబు

ఇంద్రకీలాద్రిపై పండుగ వాతావరణం వెల్లివిరిసింది. పండితుల వేద ఘోషతో కొండ మార్మోగింది. డప్పు కళాకారుల విన్యాసాలతో హోరెత్తింది. దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ బృహత్ ప్రణాళికలో భాగంగా పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. అలాగే ఇప్పటికే ప్రభుత్వ నిధులతో చేపట్టి, పూర్తి చేసిన పలు నిర్మాణాలను ఆయన అట్టహాసంగా ప్రారంభించారు. కార్యక్రమానికి విచ్చేసిన సీఎంకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి తానేటి వనిత, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ సాదరంగా ఆహ్వానం పలికారు. అలాగే ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, రుహుల్లా, అరుణ్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు, తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ, కలెక్టర్ ఢిల్లీరావు, సీపీ టి.కె. రాణా, డీసీపీ విశాల్‌గున్ని, జేసీ సంపత్‌కుమార్, నగర కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్, సబ్ కలెక్టర్ అదితి సింగ్, దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతించారు.

– ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ)



ఆలయం లోపలికి వస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్. చిత్రంలో మంత్రులు సత్యనారాయణ, తానేటి వనిత, ఎమ్మెల్యే వెలంపల్లి

వర్సిటీ ఫుట్‌బాల్ విన్నర్ పీఎన్‌సీ అండ్ కేఆర్ కళాశాల



వర్సిటీ ఫుట్‌బాల్ విన్నర్ జట్టు సభ్యులతో కళాశాల ప్రతినిధులు

నరసరావుపేట ఈస్ట్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల పురుషుల ఫుట్‌బాల్ పోటీలలో పీఎన్‌సీ అండ్ కేఆర్ డిగ్రీ కళాశాల జట్టు ప్రథమ స్థానం సాధించటంతో పాటు నలుగురు క్రీడాకారులు వర్సిటీ జట్టులో స్థానం సాధించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ మేజర్ జి.వి.రావు, వ్యాయామ అధ్యాపకుడు పి.వెంకటేష్ గురువారం తెలిపారు. వర్సిటీ క్రీడా మైదానంలో ఈనెల 1,2 తేదీలలో నిర్వహించిన పోటీలో తమ జట్టు ప్రథమ స్థానం సాధించటంతో పాటు జట్టులోని పి.విజయసాయి, జె.సుధాకర్, కె.రావికిరణ్, కె.జీవన్‌కుమార్ వర్సిటీ జట్టులో స్థానం సాధించారని వివరించారు. క్రీడాకారులను కళాశాల కార్యదర్శి డాక్టర్ ఎం.ప్రేమ్‌చంద్, జాయింట్ సెక్రటరీ పి.శ్రీనివాసప్రసాద్, కోశాధికారి డాక్టర్ ఎం.అన్నపూర్ణమ్మ, వైస్ ప్రిన్సిపాల్ రాధాకృష్ణమూర్తి అభినందించారు.

జేఎన్‌టీయూకే వర్సిటీ స్విమ్మింగ్ జట్లు ఎంపిక



జేఎన్‌టీయూకే వర్సిటీ స్విమ్మింగ్ జట్లకు ఎంపికైన క్రీడాకారులతో వర్సిటీ ప్రతినిధులు

నరసరావుపేట ఈస్ట్: ఈత అత్యుత్తమ వ్యాయామమని జేఎన్‌టీయూ–ఎన్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. కళాశాల ఆధ్వర్యంలో గురువారం సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల స్విమ్మింగ్ పూల్‌లో జేఎన్‌టీయూ కాకినాడ విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల పురుషులు, మహిళల స్విమ్మింగ్ పోటీలు, వర్సిటీ స్విమ్మింగ్ జట్ల ఎంపిక నిర్వహించారు. వర్సిటీ పరిధిలోని 5 జిల్లాలోని కళాశాలల నుంచి స్విమ్మర్లు పోటీలో పాల్గొన్నారు. పోటీలను ప్రారంభించిన ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ బాల్యం నుంచి ఈత నేర్చుకోవటం ద్వారా వరదల సమయంలో ప్రాణాప్రాయం నుంచి రక్షణ పొందటంతో పాటు ఇతరులకు సహాయపడవచ్చని తెలిపారు. కాగా, వర్సిటీ జట్టుకు పురుషుల విభాగంలో పి.సుజన్‌చౌదరి, పి.ఎస్.జి.ప్రణవ్‌రాహుల్, పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల (కానూరు), జి.శశివర్ధన్, వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల (కానూరు), పి.ధనుష్, ఐడియల్ ఇంజినీరింగ్ కళాశాల (కాకినాడ), స్టాండ్‌బై వి.దీపక్‌అజయ్, ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల (సూరంపాలెం), ఆర్.గిరిష్‌కుమార్, వీఆర్ సిద్ధార్థ కళాశాల (కానూరు), మహిళా జట్టుకు ఎస్.కీర్తన, సీహెచ్.మౌనిక, ఎం.దేవిదుర్గాసుధేష్ణ, వీఆర్ సిద్ధార్థ కళాశాల (కానూరు), కె.మోక్షిత ఎస్.వి.ఇంజినీరింగ్ కళాశాల (భీమవరం) ఎంపికయ్యారు. జట్టు ఎంపిక కమిటీ సభ్యులుగా ఎన్ఈసీ కళాశాల పీడీ ఎల్.కృష్ణారెడ్డి, డీఎస్ఏ స్టేడియం స్విమ్మింగ్ కోచ్ జి.సురేష్, పరిశీలకుడిగా జేఎన్‌టీయూ –ఎన్ ఇంజినీరింగ్ కళాశాల వ్యాయామ సంచాలకులు డాక్టర్ జి.పి.రాజు వ్యవహరించారు.

బీసీలను గుండెల్లో పెట్టుకున్న సీఎం జగన్

- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- సత్తెనపల్లి నియోజకవర్గ స్థాయి రజకుల ఆత్మీయ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: బడుగు, బలహీనవర్గాల ప్రజలు అండగా ఉన్నంతకాలం వంద మంది చంద్రబాబులు, పవన్ కల్యాణ్‌లు కలిసి రాజకీయ రణరంగంలో తలపడినా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఓడించలేరని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు స్పష్టం చేశారు. సత్తెనపల్లిలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయం వద్ద గురువారం నియోజకవర్గ స్థాయి రజకుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశానికి రజక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పాతపాటి అంజిబాబు అధ్యక్షత వహించారు. మంత్రి రాంబాబు మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు మోసాలు, స్కాంలు చేయడంలో, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంలో పండితుడన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ చదువుకోవాలని, పేదలంతా చదువుకుంటే సమాజంలో వారికి గుర్తింపు, గౌరవం లభిస్తుందని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగానికి పెద్దపీట వేసి అమ్మఒడి పథకం ద్వారా ఏటా రూ.15 వేలు తల్లుల ఖాతాలో జమ చేస్తున్నాడన్నారు.

బీసీలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గుండెల్లో పెట్టుకున్నారని, 45 ఏళ్లు నిండిన మహిళలకు చేయూత పథకం ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నారన్నారు. రజకులకు చేదోడు పథకం ద్వారా ఆర్థిక సాయం అందించడం జరుగుతుందన్నారు. రజకులకు ఎమ్మెల్సీ ఇవ్వడం ధర్మమని ఈ విషయంపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడుతానని, రజకులకు అండగా నిలుస్తానన్నారు. రజకులు అని సంబోధించాలే తప్ప చాకలి పదం నిషేధమన్నారు. రజకులు అంతా కలిసికట్టుగా వైఎస్సార్ సీపీకి అండగా ఉండటం అభినందనీయమన్నారు. రజక కార్పొరేషన్ చైర్మన్ సుగుమంచి రంగన్న మాట్లాడుతూ రజకులను ఎస్సీ జాబితాలో చేర్పిస్తానని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక చంద్రబాబు గాలికి వదిలేశాడన్నారు. తాను అధికారంలోకి వచ్చాక రజకుల జీవితాల్లో వెలుగులు నింపుతానని జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చి ఆ హామీలను నెరవేర్చాడన్నారు.

వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలి

రజక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పాతపాటి అంజిబాబు మాట్లాడుతూ చాకలి పదాన్ని నిషేధిస్తూ ప్రభుత్వం జీఓ ఇచ్చిందని దానిని నియోజకవర్గంలో అమలుపరిచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వైఎస్సార్ సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు యుద్ధగిరి మురళి, తూర్పుగోదావరి జిల్లా రజక సంఘ జిల్లా అధ్యక్షుడు కొండపల్లి దుర్గారావు, గుడిపూడి సర్పంచ్ తొరటి తిరుపతయ్య, సత్తెనపల్లి బసవయ్యలు మాట్లాడారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు షేక్ నాగుర్‌మీరాన్, రమావత్ కోటేశ్వరరావు నాయక్, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, ఏఎం రామలింగారెడ్డి(చిన్నా), కంటెపూడి సర్పంచ్ ఇపరాపట్నం యమునా బొబ్బిలి, లంకెలకూరపాడు మాజీ ఎంపీటీసీ గుర్రపుసాల ప్రమీల, రజక సంఘ నాయకులు విప్పర్ల పాండురంగారావు, పొట్లూరి శ్రీనివాసరావు, కురిచేటి నాసరయ్య, విప్పర్ల కొండలు, చట్టు సైదారావు, మందడపు సాయి, ఉల్లంఘుల ప్రసాద్‌బాబు, కురిచేటి వెంకయ్య, చట్టు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది



కొండకావూరులో అరటి పంటను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ కమిషనర్ ఎస్ఎస్ శ్రీధర్

- ఉద్యానశాఖ కమిషనర్ ఎస్ఎస్ శ్రీధర్
- కొండకావూరులో పంట నష్టం పరిశీలన

నరసరావుపేట రూరల్: తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం అందుకుంటుందని రాష్ట్ర ఉద్యానశాఖ కమిషనర్ ఎస్ఎస్ శ్రీధర్ తెలిపారు. మిచాంగ్ తుఫాన్ కారణంగా మండలంలో దెబ్బతిన్న ఉద్యాన పంటలను ఆయన పరిశీలించారు. కొండకావూరులో భారీవర్షంతో దాదాపు 24 ఎకరాల్లో అరటి తోటలకు నష్టం వాటిల్లింది. పూర్తిగా నేలకొరిగిన అరటి, మిరప పంటలను పరిశీలించారు. పంటలను రక్షించుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ఉద్యానశాఖ కమిషనర్ మాట్లాడుతూ తుఫాన్ కారణంగా ఉద్యాన పంటలకు ఎక్కువగా నష్టం జరిగిందన్నారు. గాలి ఎక్కువగా ఉండటం వలన అరటి తోటలు నేలకొరిగాయని తెలిపారు. నీరు నిలిచి ఉండటం వలన మిరప పంటకు నష్టం వాటిల్లిందని తెలిపారు. పంట పొలాల్లో నిలిచిన నీటిని బయటకు వెళ్లబెట్టాలని రైతులకు సూచించామని, ఇప్పటికే రైతులు దీనిని పాటిస్తున్నారని తెలిపారు. రైతులకు ఎటువంటి సమస్యలు ఉన్నా అధికారులను సంప్రదించాలన్నారు. ప్రాథమిక నష్టపరిహారం అంచనాలు సిబ్బందికి అందుతున్నాయన్నారు. దెబ్బతిన్న పంటపొలాలకు ఈ–క్రాప్ బుకింగ్ జరిగిందని తెలిపారు. పంట నష్టం అంచనాను శుక్రవారం నుంచి సిబ్బంది చేపడతారని తెలిపారు. వారం రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తిచేస్తామని స్పష్టం చేశారు.

మెడికల్ షాపుల్లో విజిలెన్స్ తనిఖీలు

- మూడు షాపుల్లో లోపాలు గుర్తింపు
- శాంపిళ్లను విజయవాడ ల్యాబ్‌కు పంపిన అధికారులు



షాపులో తనిఖీ చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

నరసరావుపేట: నరసరావుపేటలో గురువారం విజిలెన్సు అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టణంలోని పలు మెడికల్ షాపులను తనిఖీ చేశారు. బిల్లులు ఇవ్వకుండా, ఫార్మాసిస్ట్ లేకుండా నాణ్యత లేని నాసిరకం మందులు అమ్ముతున్నారనే విశ్వసనీయమైన ముందస్తు సమాచారంపై రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ ఆదేశాల మేరకు గుంటూరు రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె.ఈశ్వరరావు పర్యవేక్షణలో అధికారులు రెండు టీములుగా స్థానిక డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ సునీతతో వివిధ ప్రాంతాల్లో ఆకస్మిక తనఖీలు నిర్వహించారు. మల్లమ్మసెంటర్‌లోని గోపాలకృష్ణ మెడికల్స్, వెంకటకృష్ణ మెడికల్స్, వెంకట మురళి మెడికల్ స్టోర్‌లలో తనిఖీ చేసి పలు లోపాలను గుర్తించారు. మూడు షాపులలో డాక్టర్ ప్రిస్కిప్షన్ లేకుండా, అమ్మకపు బిల్లులు లేకుండా మెడిసిన్ విక్రయిస్తున్నారు. షెడ్యూలు రిజిస్టర్ నిర్వహించుట లేదని గుర్తించారు. మూడు షాపుల నుంచి శాంపిల్స్ సేకరించి విజయవాడ డ్రగ్ కంట్రోల్ లేబొరేటరీకి పంపించారు. తనిఖీలలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టరు ఎ.శ్రీహరిరావు, ఎస్.శ్రీనివాసులురెడ్డి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వై.శివనారాయణ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

మరొకరికి గాయాలు



నరసింహారావు

అద్దంకి రూరల్: లారీ బైకును ఢీకొట్టడంతో వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందగా మరో వ్యక్తి గాయాల పాలయ్యాడు. ఈ ఘటన అద్దంకి పట్టణంలో గురువారం కలవకూరు జంక్షన్ వద్ద చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. అద్దంకి పట్టణంలోని పెరికపాలేనికి చెందిన కుంచాల నరసింహారావు (70), రోశయ్యలు బైకు మీద అద్దంకి–నార్కెట్‌పల్లి నామ్ రహదారిపై వెళ్తుండగా కలవకూరు జంక్షన్ వద్దకు రాగానే వెనుకగా వస్తున్న లారీ వేగంగా వచ్చి బైకును ఢీకొట్టింది. దీంతో నరసింహారావు కాలుపై నుంచి లారీ వెళ్లటంతో నుజ్జునుజ్జయి తీవ్ర రక్తస్రావమైంది. స్థానికుల సమాచారంతో 108 వాహనంలో ఇరువురిని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తీవ్ర రక్తస్రావమైన నరసింహారావు మృతి చెందాడు. గాయాలైన రోశయ్యను ఒంగోలులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని లారీని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

గ్యాస్ లోడుతో వెళుతున్న వాహనం దగ్ధం



ప్రమాదంలో దగ్ధమైన వాహనం

భట్టిప్రోలు: గ్యాస్ లోడుతో వెళుతున్న వాహనం నుంచి గురువారం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. డ్రైవర్ అప్రమత్తం కావడంతో పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే స్థానిక సాయి జ్యోతి ఇండేన్ గ్యాస్ కంపెనీ నుంచి సిలిండర్‌లు డెలివరీ ఇచ్చేందుకు వాహనంలో డ్రైవర్ శ్రీకాంత్, డెలివరి బాయ్ ఐలవరం బయలుదేరారు. భట్టిప్రోలు–ఐలవరం మధ్యకు వచ్చేసరికి వాహనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన డ్రైవర్, డెలివరీ బాయ్ వాహనంలోని 20 గ్యాస్ బండలను బయటకు లాగేశారు. పెను ప్రభావం తప్పింది. సంఘటనా స్థలాన్ని గ్యాస్ కంపెనీ నిర్వాహకులు యడ్ల సునీల్, సిబ్బంది పరిశీలించారు. ప్రమాదం తప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు.

వృద్ధురాలిపై యువకుడి లైంగిక దాడి

విచారణ చేపట్టిన డీఎస్పీ

వినుకొండ(నూజెండ్ల): వృద్ధురాలిపై యువకుడు లైంగిక దాడికి పాల్పడిన సంఘటన వినుకొండ పట్టణం మేదరబజారులో బుధవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మేదరబజారులో నివాసం ఉంటున్న చందా లక్ష్మమ్మ (74)పై అర్ధరాత్రి సమయంలో సుమారు 20 ఏళ్ల యువకుడు లైంగికదాడికి పాల్పడ్డాడు. కొంతసేపటి తర్వాత తేరుకున్న ఆమె స్థానికుల సహాయంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై నరసరావుపేట డీఎస్పీ మహేష్, టౌన్ సీఐ సాంబశివరావులు సంఘటనా ప్రాంతానికి వెళ్లి విచారణ చేపట్టారు. వృద్ధురాలిపై లైంగికదాడికి పాల్పడిన యువకుడి వివరాలు సేకరించి త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

మరొకరి పరిస్థితి విషమం



మృతి చెందిన ఆంజనేయులు

నరసరావుపేటరూరల్: కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందగా, ఇరువురు తీవ్రంగా గాయపడిన ఘటన రావిపాడు సమీపంలో చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. నకరికల్లు మండలం చల్లగుండ్ల గ్రామానికి చెందిన బడికంచుల ఆంజనేయులు(35), భార్య పద్మ, వదిన శ్రీలక్ష్మిలతో కలసి ద్విచక్రవాహనంపై నరసరావుపేట నుంచి స్వగ్రామానికి వెళ్తున్నారు. రావిపాడు శివారులోని సచివాలయం వద్ద ద్విచక్రవాహనాన్ని ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆంజనేయులు అక్కడికక్కడే మృతిచెందగా, పద్మ, శ్రీలక్ష్మి తీవ్రంగా గాయపడ్డారు. 108 అంబులెన్స్ ద్వారా వీరిని పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో శ్రీలక్ష్మి పరిస్థితి విషమంగా ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ పోలీసులు తెలిపారు. మృతుడు ఆంజనేయులు సమీప బంధువు వివాహం గురువారం రాత్రి గ్రామంలో ఉంది. వధువు కూడా బంధువు కావడంతో పట్టణంలో మధ్యాహ్నం జరిగిన విందుకు హాజరై తిరిగి వెళ్తుండగా ప్రమాదం బారిన పడ్డారు. ఆంజనేయులు మృతి వార్తతో పెళ్లి ఇంట విషాదం నెలకొంది.